నిమ్మ చెట్ల తొలగింపు దారుణం



పేదల భూముల్లో అధికారులు తొలగించిన నిమ్మచెట్లు



అధికారులు తొలగించిన నిమ్మ చెట్లను పరిశీలిస్తున్న నేదురుమల్లి

- బాధిత కుటుంబాలకు అండగా వైఎస్సార్‌సీపీ
- నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

సైదాపురం: పేద రైతుల్లోని భూముల్లో నిమ్మచెట్లను తొలగించడం దారుణమని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని గద్దల తిప్ప వద్ద 793 సర్వేనంబర్‌లో పేదలు సాగు చేసుకుంటున్న నిమ్మ చెట్లను అకారణంగా అధికారులు తొలగించిన ప్రదేశాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయనతోపాటు మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్, వందలాది మంది రైతులు తరలివచ్చారు. అధికారులు, పోలీసుల సహకారంతో నలుగురు రైతులకు చెందిన 500 నిమ్మ చెట్లను శనివారం తొలగించారు. ఆ రైతుల భూములను పరిశీలించిన నేదురుమల్లి వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిమ్మ చెట్లు తొలగించిన ప్రాంతంలో నిమ్మ కాయలు గుట్టలు, గుట్టలుగా పడి ఉన్న దృశ్యాలను చూసి నిశ్చేష్టులైపోయారు. ఇలాంటి దుర్మార్గమైన పనులు ఎవరైనా చేస్తారా అంటూ ఆయన మండిపడ్డారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పేదల భూముల్లో కూటమి ప్రభుత్వం అరాచకాలు సాగిస్తోందన్నారు. 30ఏళ్లుగా నిరుపేద వడ్డెర కులానికి చెందిన రైతులు కష్టపడి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. గతంలో ఏక్‌సాల్ లీజులను ఏడాది పాటు ఇచ్చే వారన్నారు. అప్పటినుంచి ఆ రైతులు ఆభూములను సాగు చేసుకుంటున్నట్లు వివరించారు. ఎందుకూ పనికి రాని ఆ భూమిని సారవంతంగా మార్చుకున్నారని పేర్కొన్నారు. ఈ భూమిపై కన్నేసిన టీడీపీ నేత కోసం జేసీబీలతో 500 నిమ్మ చెట్లను తొలగించి, పేద రైతులు పొట్టకొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నలుగురు రైతుల నిమ్మ చెట్లను తొలగించేందుకు 200మంది పోలీసులు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. బాధిత రైతులకు న్యాయం జరిగేంత వరకు నిరంతరం పోరాటం సాగిస్తామన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు గుంటమడుగు శ్రీనివాసులు రాజు, మోహన్‌రావు, శివకుమార్, నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆదిశేషయ్యనాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, బట్టేపాటి దయాకర్‌రెడ్డి, చీర్ల బ్రదర్స్, వరప్రసాద్‌రాజు, యోగిరాజు, శ్రీనివాసులురాజు, రాంగోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, అబ్బిరాజు, ఉపసర్పంచ్ శివకుమార్, సాంబయ్య, పెంచలయ్య, ఈశ్వరయ్య, రాజశేఖర్‌నాయుడు, ఓబుల్‌నాయుడు, వెంకటయ్య, రమేష్, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



రమణయ్య మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

దొరవారిసత్రం : మండలంలోని తొగరాముడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గడ్డం రమణయ్య గుండె పోటుతో మృతి చెందగా స్థానిక మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదివారం ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించి సంతాపం తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల కన్వీనర్ అల్లూరు రాహుల్‌రెడ్డి, నాయకులు రావిళ్ల ప్రసాద్‌నాయుడు, గోను ప్రసాద్ ఉన్నారు.

వారిపై చర్యలు తీసుకోండి

సైదాపురం: పేదలు సాగు చేసుకుంటున్న నిమ్మ చెట్లను అన్యాయంగా తొలగించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డిపి పోలయ్య డిమాండ్ చేశారు. సైదాపురంలోని రైతు కూలీ సంఘం కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలు సాగు చేసుకుంటున్న భూములకు తక్షణమే పట్టాలు మంజూరు చేయాలన్నారు. చెట్లు నరికివేసిన వాటికి ఆర్థిక సహాయాన్ని కూడా బాధిత రైతులకు అందించాలని ఆయన డిమాండ్‌చేశారు. ఆయన వెంట చెంగల్‌రావు, మమత ఉన్నారు.

గునపాడులో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్త దానం చేస్తున్న దాతలు

చిట్టమూరు: మండల పరిధిలోని గునపాడులో ఆదివారం ఉపాధ్యాయ బృందం గ్రామ యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామంలో 12 ఏళ్లుగా ప్రతి ఏటా రెండు పర్యాయాలు గునపాడు జెడ్పీ హైస్కూల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు విశ్రాంత ఉపాధ్యాయుడు కందాటి రామిశెట్టి తెలిపారు. ఈ రక్త దాన శిబిరంలో 31 మంది రక్తదానం చేశారు. ఇందులో ముఖ్యంగా ఐదుగురు మహిళలు రక్తం దానం చేశారు. నిర్వాహకుడు కందాటి రామిశెట్టి 30వ సారి రక్తదానం చేశారు. నెల్లూరు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొని రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ పీఆర్‌ఓ మధుసూధన్‌రావు, వాకాడు ఎంఈఓ నశీంఆలీ, ఉపాధ్యాయుల బృందం, గ్రామంలోని యువత పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కేల్లో పీఎండీఎస్ కిట్లు

గూడూరురూరల్ : మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, భూసారాన్ని పెంచి భూమికి సత్తువనిచ్చే 26 రకాల విత్తనాల కలయికతో రూపొందించిన పీఎండీఎస్ కిట్లను రాయితీపై రైతులకు సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి వి.రమేష్ తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో రైతు సేవా కేంద్రాలను సంప్రదించి బయో మెట్రిక్ ద్వారా విత్తనాలు పొందాలని కోరారు.

రోటరీ క్లబ్ నూతన కమిటీ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని రోటరీ క్లబ్ నూతన ప్రెసిడెంట్‌గా ఆదవరం నాగురయ్యను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు రోటరీ జిల్లా గవర్నర్లు కేశవరెడ్డి, ముని గిరీష్ ప్రకటించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో రోటరీ క్లబ్ నూతన కమిటీని ఎంపిక చేశారు. కార్యదర్శిగా బట్ట సుబ్రహ్మణ్యం యాదవ్, కోశాధికారిగా మునగాల కృష్ణారావును ఎంపిక చేసి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన కమిటీని సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ పెసల జయరాజగోపాల్, రామ్మోహన్‌రావు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం

ఓజిలి : అతివేగంగా ప్రయాణిస్తున్న కారు.. బైక్‌ను ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, మండలంలోని చిలమానుచేను గ్రామానికి చెందిన కొండూరు బాలయ్య(55) గూడూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఆయన విధుల నిమిత్తం బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యంలో శ్రీకాళహస్తి నుంచి కోదాడకు వెళ్తున్న కారు బైక్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడు పేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు 28-7-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	134
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	264
లేయర్ చికెన్	:	190

1న నృసింహునికి చందనాలంకరణ

రాపూరు: మండలంలోని పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తి ఆగస్టు 1న చందనాలంకరణలో దర్శనమివ్వనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఆ రోజు స్వాతినక్షత్రం స్వామివారి జన్మనక్షత్రం కావడంతో స్వామివారికి ఉదయం 4గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతి హోమం, 10గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటల కు బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కండలేరులో 27.2 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 27.2 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2100, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం: జాతీయ రహదారిపై ఆటో అదుపు తప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, కోటపోలూరు నుంచి సూళ్లూరుపేటకు వెళ్లే క్రమంలో తల్లంపాడు టోల్‌ప్లాజా వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మణితో పాటు ప్రయాణికుడు నందకిషోర్ గాయపడ్డారు. వీరిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు



మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మీ

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలో అన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతున్నారని వీటి గురించి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీపీ కరుగొండ ధనలక్ష్మీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి పరిశీలన చేసి అమ్మకాలు జరిపే వారి పేర్లు నమోదు చేయాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన ఎంపీపీతోపాటు ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి మాట్లాడారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో త్రీ ఫ్యూజ్ లైన్‌ల కోసం విద్యుత్ స్తంభాలు వేస్తుండడంతో పలు చోట్ల గ్రామాల్లో తాగునీటి పైప్‌లైన్లు పగలగొడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైస్ ఎంపీపీ కృష్ణవేణితోపాటు ఈఓపీఆర్‌డీ మల్లు గోపాల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని వాటిపై పరిశీలన చేయాలని వెలుగు ఏపీఓ భానుప్రియకు సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్యంతోపాటు ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. ఈ సమావేశంలో జెట్పీటీసి కట్టా జ్యోతి రెడ్డి, తహశీల్దారు మాగర్ల రాజేంద్ర, ఎంపీడీఓ సురేష్‌బాబు, వెటర్నరి శాఖ ఏడీ గోవర్ధన్ రెడ్డి, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



పెద్దిరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

చిల్లకూరు: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆదివారం తిరుపతిలోని ఆయన నివాసంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో పాటుగా గూడూరు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, అక్రమ కేసులపై ఆయనతో చర్చించారు. ఆయనతోపాటు చిట్టమూరు మండలాల కన్వీనర్లు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మెట్టా రాధాక్రిష్ణారెడ్డి, గూడూరు ఎంపీపీ బూదూ రు గురవయ్య, సీనియర్ నాయకులు యద్దల నరేంద్రరెడ్డి, చేవూరు విజయ మోహన్‌రెడ్డి, కొడూరు సునీల్‌రెడ్డి, అట్ల శ్రీనివాసులరెడ్డి, యల్లా శ్రీనివాసులరెడ్డి, మదురెడ్డి, క్రిష్ణారెడ్డి, జనార్ధనరెడ్డి, వేణురెడ్డి, క్రిష్ణయ్య, కొట్ట అశోక్, మల్లి రమేష్, సాయి, కోటయ్య ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు కాంట్రాక్ట్‌కా?

గూడూరురూరల్ : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేసే పనులను ప్రైవేట్ వర్క్ కాంట్రాక్ట్‌కు అప్పగించడం తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సొంత మున్సిపాలిటీ అయిన నెల్లూరులో మున్సిపల్ కార్మికుల పనులు ప్రైవేట్ వర్క్ కాంట్రాక్ట్‌కి ఇవ్వడం దారుణమన్నారు. వెంటనే ఆ పనులను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షుడు చెంగయ్య, సీఐటీయు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య పాల్గొన్నారు.

వెటర్నరీ హాస్పిటల్ ప్రారంభం



ఆస్పత్రి ప్రారంభిస్తున్న హనుమంతరావు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపు వీధిలో ఆదివారం నూతన వెటర్నరీ హాస్పిటల్ ప్రారంభించారు. డాక్టర్ నర్మద మాట్లాడుతూ ఇక్కడి వైద్యశాలలో పాడి పశువులతోపాటు గొర్రెలు, మేకలు పెంపుడు కుక్కలు, పిల్లులు తదితర జంతువులకు వివిధ రకాల వ్యాధులకు వైద్య సేవలు అందిస్తామన్నారు. విశ్రాంత బ్యాంక్ మేనేజర్ ఎం.హనుమంతరావు, పశు సంవర్ధక శాఖ ఏడీ గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యంగా ముమ్మర తనిఖీలు

నాయుడుపేటటౌన్: నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. పట్టణంలోని 12 గుజిరీ(తుక్కు కొనుగోలు చేసే) దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ మోటార్లు దొంగతనాలు చేసి ఈ తుక్కు దుకాణాల్లో విక్రయాలు జరుపుతున్నారని చెప్పారు. అటువంటి వారిని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చోరీ సొత్తును కొనుగోలు, విక్రయాలు జరపడం నేరమని చెప్పారు. అలాంటి క్రయ విక్రయాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తప్పవంటూ డీఎస్పీ హెచ్చరికలు జారీ చేశారు. ఈ తనిఖీల్లో నాయుడుపేట అర్బన్, రూరల్ సీఐలు బాబి, సంగమేశ్వ రావు, ఎస్‌ఐలు ఆదిలక్ష్మి, శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ గీతా కుమారి

గూడూరురూరల్ : రౌడీ షీటర్లు సత్ప్రవర్తన మెలగాలని గూడూరు డీఎస్పీ గీతా కుమారి అన్నారు. రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం పట్టణ, రూరల్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ శాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. కార్యక్రమంలో సీఐ శేఖర్‌బాబు, ఎస్‌ఐలు మనోజ్‌కుమార్, తిరుపతయ్య పాల్గొన్నారు.

18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

గూడూరు పట్టణంలోని రాణిపేటలో సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అక్కడి ప్రజలకు సూచించారు.

పేదల పక్షాన నిలిచేది ఎర్ర జెండానే



మాట్లాడుతున్న హరినాథ్‌రెడ్డి

గూడూరురూరల్ : పేదల పక్షాన నిలిచేది ఎర్ర జెండానే అని, సమాజంలో దోపిడీ వ్యవస్థ ఉన్నంత కాలం కమ్యూనిస్టు అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం సీపీఐ గూడూరు నియోజకవర్గం 2వ మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హరినాథ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి హాజరయ్యారు. ముందుగా సీపీఎం కార్యాలయం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ మీదుగా విశ్రాంత ఉద్యోగుల భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీపీఐ ధ్యేయం అన్నారు. వందేళ్లుగా పార్టీ ఎన్నో పోరాటాలు చేసి కార్మిక, కర్షక, పేదల పట్ల నిలిచిందని, పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, పట్టణ కార్యదర్శి కాలేషా, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నారా యణ, రైతు సంఘం జిల్లా నాయకులు సి.వి.ఆర్. కుమార్, శ్రీనివాసమూర్తి, రమేష్, గోపీ, ప్రసన్న పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండగా గున్నం ట్రస్టు




సరుకులు అందిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు

చిల్లకూరు: రెడ్డి సామాజిక వర్గంలోని 25 పేద కుటుంబాలకు గున్నం సేవా ట్రస్టు నిర్వాహకులు అండగా నిలబడడం అభినందనీయమని సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్టు వారి సహకారంతో 25 పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి నిరంజన్ రెడ్డి, ప్రజేంద్రరెడ్డి, కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెర్రికాలువకు గండి



నెర్రికాలువ-కాళంగినదికి మధ్య వున్న కరకట్టకు పడిన గండికి వేసిన ఇసుక బస్తాలు (ఫైల్)





నెర్రి కాలువ నుంచి కాళంగి నదిలోకి పోతున్న నీరు

- తాత్కాలిక మరమ్మతుల పేరుతో నిధుల స్వాహా
- కాళంగినదిలో కలిసిపోతున్న సాగునీరు
- 5 చెరువుల కింద సాగు ప్రశ్నార్థకం

సూళ్లూరుపేట: తెలుగు తమ్ముళ్ల జేబులు నింపేందుకు చేపట్టిన తాత్కాలిక మరమ్మతుల వల్ల సాగునీటికి ఉపయోగపడాల్సిన నీరు కాళంగినదిలో కలిసిపోయి వృథా అవుతోంది. అయినా అధికార యంత్రాంగం స్పందించకపోవడం శోచనీయం. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు వరప్రదాయినిగా ఉన్న నెర్రికాలువకు గత ఏడాది పడిన గండ్లుకు తెలుగు తమ్ముళ్ల ప్రాపకం కోసం తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. తాత్కాలిక మరమ్మతుల కింద వేసిన ఇసుకబస్తాలు కొట్టుకుపోవడంతో నెర్రికాలువ ద్వారా 5 చెరువులకు వెళ్లాల్సిన సాగునీరంతా కాళంగినదిలో లిసిపోతోంది. దీంతో 5 చెరువుల కింద సుమారు 15,000 ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో సూళ్లూరుపేట, తడ మండలాల రైతాంగం ఆందోళన చెందుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. ప్రస్తుతం దుక్కులు చేస్తున్నారు. నెర్రికాలువ ద్వారా చెరువులు నిండితే నారుమళ్లు పోసుకోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో చెరువులకు చేరాల్సిన నీళ్లు కాళంగినదిలోకి వృథాగా కలిసిపోతోంది.


వివరాల్లోకి వెళితే..

గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలతో పట్టణంలోని పరిశుద్ధ మిఖాయేల్ లూథరన్ చర్చి వెనుక భాగాన నెర్రికాలువ-కాళంగినదికి మధ్యన వున్న కరకట్టకు భారీ గండి పడడంతో తాత్కాలిక మరమ్మతుల కింద ఇసుకబస్తాలు వేశారు. ప్రస్తుతం జిల్లాలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కాళంగినదికి నీళ్లు చేరాయి. దీంతో తనియేలి వద్ద కాళంగి ఆనకట్ట నుంచి నెర్రికాలువకు పుష్కలంగా నీళ్లు చేరుతున్నాయి. కరకట్టకు వేసిన ఇసుక బస్తాల్లో కొట్టుకుపోయి నీళ్లు మళ్లీ కాళంగినదిలోకి వెళ్లి పోతున్నాయి. అంటే కాలువకు కింది భాగాన్న ఉన్న గోపాల్‌రెడ్డిపాళెం, కారిజాత, పాములమిట్ట, వాటంబేడు, సూళ్లూరు చెరువులకు చేరాల్సిన నీళ్లు కాళంగినదిలోకి కలిసిపోతున్నాయి. గొల్లలములువ్వ, పల్లెపాళెంగ్రామాలు నెర్రికాలువ ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువకు తెల్లటి గోనెసంచుల్లో ఇసుక, మట్టిని నింపి అడ్డుకట్ట వేయడం వల్ల ప్రయోజనం లేదని చెబుతున్నారు. కేవలం తెలుగుతమ్ముళ్లు నిధులు స్వాహా చేయడానికి ఈ తాత్కాలిక పనులు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్రమ మద్యం స్వాధీనం

బాలాయపల్లి(సైదాపురం) : అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని బాలాయపల్లి పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ గోపి కథనం మేరకు రామాపురానికి చెందిన బండి పాపయ్య రామాపురం క్రాస్‌రోడ్డులో అనుమానాస్పదంగా కనిపించారు. తనిఖీలు చేయగా అతని వద్ద 10 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. మద్యంతోపాటు, రామయ్యను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపి తెలియజేశారు.

కారును ఢీకొన్న లారీ



దెబ్బతిన్న కారు

చిల్లకూరు: నెల్లూరు నుంచి నాయుడుపేట వైపు వెళుతున్న కారును అదే మార్గంలో వస్తున్న లారీ ఢీకొంది. అయితే ఈ ఘటనలో కారు దెబ్బతినగా అందులో ప్రయాణించే వారికి పెద్ద ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం మేరకు నాయుడుపేటకు చెందిన ఓ కుటుంబం నెల్లూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా వరగలి క్రాస్ రోడ్డు వద్ద అధిగమించే ప్రయత్నం చేసిన లారీ అదుపు తప్పి కారును ఢీ కొంది. దీంతో కారు డోరు దెబ్బతినగా లోపల ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు. కారు యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని లారీతో పాటుగా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.